సాక్షి
ఒడిశా

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 5,78,858
బంగారం : 13 గ్రాముల 660 మిల్లీ గ్రాములు
వెండి : 35 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



విజ్ఞాన మేళా అదరహో..

పర్లాకిమిడిలోని సరస్వతీ శిశువిద్యామందిర్‌లో విజ్ఞానమేళా 2025–26ను జిల్లా ముఖ్యశిక్షాధికారి డాక్టర్ మాయాధర్ సాహు ప్రారంభించారు.

- 8లో



ఉపాధ్యాయుల ఆందోళన

యూనిఫైడ్ ఆటోమిషన్ సిస్టమ్(యు.ఎ.ఎస్)కు వ్యతిరేకంగా జయపురం సబ్ డివిజన్‌లో ఉపాధ్యాయులు శనివారం ఆందోళన చేపట్టారు.

- 8లో

న్యూస్‌రీల్

ఆదివాసీ ఉత్సవాల ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఆదివాసీ నాయకులు

రాయగడ: ఈ నెల తొమ్మిదో తేదీన జరగనున్న విశ్వ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రచార రథాన్ని అధికారులు ప్రారంభించారు. స్థానిక మజ్జిగౌరీ మందిరం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివాసీ సంప్రదాయ ఉత్సవాలను అందరికీ తెలియజేసేందుకు ఈ ప్రచార రథం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తిరుగుతూ అవగాహన కల్పిస్తుంది. ఆదివాసీ నాయకులు లాల్‌బిహారి హిమిరిక, తపన్ పెద్దింటి, మంజులా మినియాక, జలంధర్ పుషిక, చక్రధర్ బిడిక తదితరులు పూజల్లో పాల్గొని రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

ఐదు ప్రతిపాదనలకు ఆమోదం



మనోజ్ ఆహుజా, చీఫ్ సెక్రటరీ

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన 23వ రాష్ట్ర మంత్రి మండలి సమావేశం శుక్రవారం లోక్ సేవా భవన్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలపై ప్రముఖ కార్యదర్శి మనోజ్ అహుజా మీడియాకు వివరించారు. మంత్రి మండలి సమావేశంలో చర్చ తర్వాత 4 విభాగాల నుంచి 5 ప్రతిపాదనలు ఆమోదించబడ్డాయి. వాటిలో జలవనరులు, సూక్ష్మ, లఘు, మధ్య తరహా పరిశ్రమలు, ఆర్థిక శాఖల నుంచి ఒక్కో ప్రతిపాదన, న్యాయ శాఖ నుంచి 2 ప్రతిపాదనలను మంత్రి మండలి ఆమోదించినట్లు మనోజ్ ఆహుజా పేర్కొన్నారు.

ఎన్‌ఐఏ డిప్యుటేషన్ ఎస్పీగా ఐపీఎస్ సాగరికా నాథ్



సాగరిక నాథ్

భువనేశ్వర్: ఖుర్దా జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఒడిశా కేడర్, 2016 బ్యాచ్ ఐపీఎస్ సాగరిక నాథ్ కేంద్ర డిప్యుటేషన్ ప్రాతిపదికన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)లో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ)గా నియమితులయ్యారు. ఈ మేరకు హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించేందుకు వీలుగా వెంటనే రిలీవ్ చేయాలని ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ జారీ అయింది. రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్, జాతీయ దర్యాప్తు బృందం ఎన్‌ఐఏ సమన్వయంగా వ్యవహరించాలని హోం శాఖ పేర్కొంది. ఈ నియామకంతో భారత దేశ ప్రధాన ఉగ్రవాద నిరోధక సంస్థలో అత్యున్నత జాతీయ భద్రతా కేసుల నిర్వహణలో సాగరిక నాథ్ దక్షత మరింత మెరుగు పడనుంది.

సమస్యలు పరిష్కరించండి



పర్లాకిమిడి పురపాలక వార్షిక సమావేశంలో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: పర్లాకిమిడి పురపాలక సంఘం వార్షిక స్వతంత్ర సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, పురపాలక ఈఓ లక్ష్మణ ముర్ము, వైస్ చైర్మన్ లెంక మధు, 16 వార్డుల కౌన్సిలర్లు హాజరయ్యారు. పర్లాకిమిడి పట్టణం అతి పురాతనమైందని, దీనిని అందంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే రూపేష్ అన్నారు. పట్టణంలో డ్రైనేజీల మరమ్మతులు, శంకర్‌బాస్ చెరువు, పట్నాయక్ చెరువు పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలన్నారు. అనేక వార్డులలో వీధి దీపాలు వెలగటం లేదని, వీటి స్థానంలో కొత్తవి వేయాలని మున్సిపల్ ఈఓ ముర్మును కోరారు.

మళ్లీ మొదటికే..!



మన్మోహన్ సామల్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు


- కొలిక్కిరాని మహానది జలాల పంపిణీ వివాదం
- విచారణ వాయిదా వేసిన ట్రిబ్యునల్

భువనేశ్వర్: మహా నది జలాల పంపిణీ వివాద పరిష్కారం కొలిక్కి రావడం లేదు. శనివారం ట్రిబ్యునల్‌లో జరిగిన విచారణతో ఈ ప్రక్రియ మళ్లీ మొదటికే వచ్చింది. ఉభయ ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు చర్చలతో వివాదం సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ఉద్దేశించిన మహా నది జలాల పంపిణీ విచారణని ట్రిబ్యునల్ సెప్టెంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది.

మలుపు తిరిగిన కథ..

దీర్ఘ కాలంగా ఛత్తీస్‌గఢ్‌తో కొనసాగుతున్న మహా నది జలాల పంపిణీ వివాదాన్ని పరిష్కరించడానికి శుక్రవారం అఖిల పక్ష సమావేశం భువనేశ్వర్‌లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీలు, వివిధ సామాజిక సంస్థల సభ్యులు హాజరయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న మహా నది జలాల పంపిణీ వివాదం పరిష్కారానికి భారత రాష్ట్రపతి, ప్రధాన మంత్రి జోక్యం చేసుకోవాలని అఖిలపక్ష సమావేశంలో ప్రతిపాదించారు. ట్రిబ్యునల్‌లో ఒడిశా ప్రభుత్వం తరపున వాదించిన అడ్వకేట్ జనరల్ పీతాంబర్ ఆచార్య గత విచారణలో రెండు రాష్ట్రాల కార్యదర్శులు, రాజకీయ నాయకుల మధ్య చర్చలు జరిపిన తర్వాత సామరస్యపూర్వక చర్చల ద్వారా వివాదాన్ని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ట్రిబ్యునల్‌కు తెలియజేశారు. ఆగస్టులో వివాద పరిష్కారంలో పురోగతి గురించి రెండు రాష్ట్రాలు ట్రిబ్యునల్‌కు తెలియజేసిన తర్వాత తదుపరి విచారణను నిర్వహించాలని ట్రిబ్యునల్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ట్రిబ్యునల్ శనివారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, రాజకీయ నాయకుల మధ్య చర్చలు పురోగతిలో ఉన్నాయి. పరిష్కారానికి రెండు పార్టీలు అంగీకరించాయని అడ్వకేట్ జనరల్ పీతాంబర్ ఆచార్య ట్రిబ్యునల్‌కు తెలియజేశారు. ఈ వివాదం పరిష్కారానికి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య ఇప్పటికే అనధికారిక చర్చలు జరిగినట్లు పేర్కొన్నారు. ట్రిబ్యునల్ ద్వారా ఎటువంటి జల వివాదం పరిష్కృతం కాలేదు. ట్రిబ్యునల్‌లో కేసు విచారణ మరో 10 సంవత్సరాలు కొనసాగిన పరిష్కారం లభిస్తుందనే ఆశ చాలా తక్కువ. రెండు రాష్ట్రాల రాజకీయ నాయకత్వం, అధికారులతో కూడిన పరిష్కారం కోసం ఆశిస్తున్నాయి. కేంద్ర హోం శాఖ మంత్రి కూడా ఇందులో జోక్యం చేసుకున్నారు. రెండు రాష్ట్రాలు వివాదాన్ని పరిష్కరించడానికి ప్రయత్నించడం పట్ల ట్రిబ్యునల్ సంతోషం వ్యక్తం చేసింది. దీని ఆధారంగా తదుపరి విచారణను ట్రిబ్యునల్ సెప్టెంబర్ 6కి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో ఉభయ పక్షాలు మహా నది జలాల పంపిణీ వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించడానికి మహానది ట్రిబ్యునల్ అదనపు సమయాన్ని మంజూరు చేసి గడువును పొడిగించింది.

ఉత్తర ప్రత్యుత్తరాలు..




పీతాంబర ఆచార్య, అడ్వకేటు జనరల్

రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, శాంతియుత పరిష్కారం కనుగొనే లక్ష్యంతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశం తర్వాత ట్రిబ్యునల్ ఉభయ పక్షాలకు స్వల్ప సడలింపు ఇచ్చింది. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన జరిగిన సమావేశం ముసాయిదా వివరాలతో ఈ ఏడాది జూలై 25 నాటి లేఖను సమర్పించిన ఒడిశా అడ్వకేట్ జనరల్ పీతాంబర్ ఆచార్య సమర్పించిన విషయాన్ని ట్రిబ్యునల్ గమనించింది. ఇందులో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయికి పంపిన సామరస్య పరిష్కారం కోసం ప్రతిపాదన జోడించారు. పరిష్కార చర్చల స్థితిని ట్రిబ్యునల్‌కు తెలియజేయడానికి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సంబంధిత కార్యదర్శులను విచారణకు హాజరు కావాలని కోరారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ఈ నెల 1న స్పందించారు. ఛత్తీస్‌గఢ్ తరపు సీనియర్ న్యాయవాది కూడా వివాద పరిష్కారాన్ని తమ ముఖ్యమంత్రి సమీక్షిస్తున్నారని ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో చర్చలకు మరింత సమయం ఇవ్వడం సముచితమని ట్రిబ్యునల్ పరిగణించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 6 ఉదయం 11 గంటలకు జరగనున్న తదుపరి విచారణ సందర్భంగా పురోగతిపై ట్రిబ్యునల్‌కు తాజా సమాచారంతో కూడిన వివరాలు దాఖలు చేయాలని ట్రిబ్యునల్ రెండు రాష్ట్రాలను ఆదేశించింది.

త్వరలో పరిష్కారం: మన్మోహన్ సామల్

మహా నది జలాల పంపిణీ వివాదం పరిష్కారానికి త్వరలో మార్గం సుగమం కానుందని, ఈ విషయంలో ముఖ్యమంత్రి ప్రధానమంత్రితో చర్చలు జరుపుతున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో దీనికి సంబంధించి ఎటువంటి ప్రత్యేక సమస్యలు లేనట్లు కనిపిస్తోందన్నారు. చర్చల ద్వారా వివాదం పరిష్కృతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో రాజస్థాన్‌లో జరిగిన అఖిల భారత రాష్ట్ర జల వనరుల మంత్రుల సమావేశం సందర్భంగా, మార్చిలో భువనేశ్వర్‌లో జరిగిన ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి బిష్ణు దేవ్ సాయి, రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఈ అంశంపై చర్చించారని గుర్తు చేశారు.

వివాదం పూర్వాపరాలివే..



మహానది



Vishnu Deo Sai

Dear Shri Mohan Charan Majhi Ji,

With regards,

Yours sincerely,

(Vishnu Deo Sai)

Shri Mohan Charan Majhi
Hon'ble Chief Minister of Odisha,
Lok Seva Bhawan,
Sachivalaya Marg,
Bhubaneswar,
Odisha

మోహన్ చరణ్ మాఝికి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రాసిన లేఖ

2014 నుంచి 2016 వరకు సుమారు మూడేళ్ల పాటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఒడిశాను సంప్రదించకుండానే బహుళ బ్యారేజీలు, ఆనకట్టలను నిర్మిస్తోందనే ఆరోపణల వెల్లువెత్తాయి. ఈ నిర్మాణాలు వర్షాకాలం తర్వాత దిగువ ఒడిశా ప్రాంతానికి నీటి ప్రవాహం అడుగంటిపోతుందని ఒడిశా వ్యక్తీకరించిన ఆవేదనని ఎగువ ఛత్తీస్‌గఢ్ పెడ చెవి ధోరణితో నిర్లక్ష్యం వహించింది. 2016 జూలైలో ఒడిశా పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తి కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని కోరింది. ఈ ఆరోపణలను ఛత్తీస్‌గఢ్ తీవ్రంగా ఖండించింది. చట్టపరమైన హక్కుల పరిధిలో అన్ని నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొంది. పరిస్థితి చేయి దాటుతున్నట్లు గమనించిన ఒడిశా 2016 నవంబర్‌లో అంతర్–రాష్ట్ర నదీ జల వివాద చట్టం, 1956 కింద ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఒడిశా సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఒడిశా ప్రభుత్వం అభ్యర్థనల్ని పరిశీలించిన మేరకు సుప్రీం కోర్టు ఆదేశాలతో 2018 మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వం జస్టిస్ ఎ.ఎం.ఖాన్విల్కర్ అధ్యక్షతన మహానది జలాల పంపిణీ వివాద ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. అది మొదలు కొని ఉభయ పక్షాల వాదోపవాదాలతో అనుబంధ పరిస్థితులు, పరిణామాలపై ట్రిబ్యునల్ విచారణ నిరవధికంగా కొనసాగిస్తోంది. అంతకు ముందు ఉభయ రాష్ట్రాల మధ్య ఈ వివాదం సామరస్య పరిష్కారానికి నిర్వహించిన చర్చలు, సమావేశాలు పూర్తిగా బెడిసికొట్టాయి. రాష్ట్రంలో కొత్తగా భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడంతో ట్రిబ్యునల్ విచారణ దారి తప్పించి సామరస్య మంతనాలకు మెలికతిప్పారు. ఈ మేరకు ట్రిబ్యునల్ అనుమతి కోసం అభ్యర్థించారు. ఈ క్రమంలో సాధించిన పురోగతిని ట్రిబ్యునల్‌కు ఉభయ పక్షాల న్యాయవాదులు వివరిస్తూ లిఖితపూర్వక ఆధారాల్ని ప్రవేశపెట్టడంతో ట్రిబ్యునల్ విచారణని వాయిదా వేసినట్లు ప్రకటించింది. రాజకీయ ప్రయత్నాలతో చట్టపరమైన పోరాటాన్ని నిర్వీర్యం చేసి రాష్ట్ర ప్రయోజనాలకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా మోహన్ చరణ్ మాఝి సర్కారు పారదర్శకంగా వ్యవహరించాలని సర్వత్రా అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

తాజా సమావేశం ఎప్పుడో...

సామరస్య చర్చలతో మహా నది జలాల పంపిణీ వివాద పరిష్కారం కోసం విచారణ వాయిదా వేయించిన ఉభయ పక్షాల న్యాయవాదులు తాజా సామరస్య సమావేశం వివరాల్ని ప్రకటించకుండా దాటవేశారు. విపక్షం వైఖరితో విశ్వసనీయత కూడగట్టుకుని న్యాయస్థానేతర కార్యాచరణకు ముందుకు సాగాలని ఇటీవల విపక్ష నేత నవీన్ పట్నాయక్ లిఖితపూర్వకంగా స్పష్టం చేశారు.

బీడీవో మమ్మల్ని పట్టించుకోవడం లేదు

- జిల్లా కలెక్టర్‌కు బొయిపరిగుడ సమితి నాయకుల ఫిర్యాదు



జిల్లా కలెక్టర్‌ను కలిసిన బొయిపరిగుడ ప్రజాప్రతినిధులు

జయపురం: బొయిపరిగుడ బీడీవో శక్తి మహాపాత్రోపై ఆ సమితి ప్రజా ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమను బీడీవో నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆరోపించారు. అంతేకాకుండా తనకు నచ్చిన పథకాల జాబితాలు తయారు చేసి వాటిని ఆమోదించేందుకు కలెక్టర్ వద్దకు పంపారని ఆరోపించారు. బొయిపరిగుడ సమితి ఉపాధ్యక్షులు పూర్ణిమ బారిక్, సమితి సభ్యులు త్రిలోచన జెన, బిభీషణ హంతాల్, కమలా హరిజన్, లక్ష్మణ చంద్రపాడియ, చంద్ర హరిజన్‌లతో పాటు పలువురు సభ్యులు కలెక్టర్‌ను శుక్రవారం కలిసి బీడీవో తీరుపై ఫిర్యాదు చేశారు. బీడీవో మహాపాత్రో సమితి సభ్యుల సమావేశం జరుపకుండా తనకు ఇష్టం వచ్చినట్టు కొన్ని పంచాయతీలలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ పథకాలలో అభివృద్ధి పనులు చేసేందుకు జాబితాను తయారు చేసి గత నెల 14వ తేదీన కలెక్టర్ ఆమోదం కోసం పంపినట్లు ఆరోపించారు. ఆ ప్రాజెక్టులపై తమకు ఎటువంటి సూచనలు చేయలేదని పెందపాడ, మఠపాడ, చెరక, దొరాగుడ, సహిద్ లక్ష్మణ నాయిక్ జన్మస్థలం తెంతులిగుమ్మ, పంచాయతీలలో ఏ ఒక్క ప్రాజెక్టు కల్పించలేదన్నారు. మరో జాబితా తయారు చేసి ఇవ్వాలని బీడీవోను కలిసి కోరినప్పటికీ పట్టించుకోలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బీడీవో పంపిన ప్రాజెక్టుల జాబితాను ఆమోదించవద్దని, సమితి సభ్యుల సమావేశం ఏర్పాటు చేయాలని, సమితి సభ్యుల ఆమోదం పొందిన ప్రాజెక్టుల జాబితాను పంపించమని బీడీవోను ఆదేశించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

బిజూ చత్రో జనతాదళ్ కార్యకర్తల ఆందోళన



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న చత్రో జనతాదళ్ కార్యకర్తలు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో బిజూ చత్రో జనతాదళ్ కార్యకర్తలు శుక్రవారం గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలోని బీజేపీ పాలనలో మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు, దాడులను నిరసిస్తు చేపట్టిన ఆందోళనలో భాగంగా పోలీస్ డీజీ పేరిట వినతిపత్రాన్ని గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్ ఐఐసీ కేకే బికే కుహరోకు చత్రో జనతాదళ్ నాయకులు అందించారు. అధికార పగ్గాలు చేపట్టిన బీజేపీ ప్రభుత్వంలు మహిళలకు రక్షణ కరువయ్యిందని, శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో చత్రో జనతాదళ్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు విష్ణుపండ, నాయకుడు కె.కిరణ్ కుమార్, కౌన్సిలర్ శివప్రసాద్ పాడి, సనోబౌరి, సమితి బీజేడీ అధ్యక్షుడు గోవర్దన్ సోబోరో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 10 మంది జవాన్లకు గాయాలు



ప్రమాదానికి గురైన జవాన్ల వాహనం

భువనేశ్వర్: అంగుల్ జిల్లా 55వ నంబరు జాతీయ రహదారిపై ఝురపడా ముండసాహి సమీపంలో ట్రక్కును పోలీసు వాహనం ఢీకొట్టింది. వాహనం ఝార్సుగుడ నుంచి భువనేశ్వర్‌కు వెళుతుండగా అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 13 మంది జవాన్లు గాయపడ్డారు. ఏడుగురు జవాన్ల పరిస్థితి విషమంగా ఉంది. తీవ్రంగా గాయపడిన ఐదుగురు జవాన్లను కటక్‌కు తరలించారు. ఆ వ్యాన్‌లో ఓఎస్‌ఏపీ 2వ బెటాలియన్ జవాన్లు ఉన్నారు.

ఉత్సాహంగా సంపూర్ణత అభియాన్

- ఆకట్టుకున్న సంప్రదాయ వస్తువుల స్టాల్స్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు



ఆశ వర్కర్లకు హెల్త్ కార్డులు అందజేస్తున్న అధికారులు



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ సోమేశ్

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రం మల్కన్‌గిరి జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో జిల్లాస్థాయి సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సోమేశ్ కుమార్ ఉపాధ్యాయ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. అలాగే ఆకాంక్ష హాట్ ప్రారంభించారు. జిల్లాకు నాలుగు స్వర్ణ పతకాలు లభించిన నేపథ్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆకాంక్ష హాట్ (సంత) వారం రోజులు జరుగుతోందని కలెక్టర్ వెల్లడించారు. బొండా గిరిజనుల పూజా సామగ్రి, పసుపుపొడి, పనస చీప్స్, గిరిజన సంప్రదాయ మట్టి వస్తువులను స్టాల్స్‌లో ప్రదర్శించారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి, చిత్రకొండ ఎమ్మెల్యేలు నర్సింగ్ మడ్కామి, మంగు ఖీలో, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సమారి టంగులు, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్‌చంద్ర సోభరో తదితరులు పాల్గొన్నారు.



పసుపుపొడి స్టాల్



మట్టి వస్తువుల ప్రదర్శన



ఆదివాసీ చిత్ర ప్రదర్శన



స్టాల్స్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ సోమేశ్ తదితరులు



బొండా మహిళాల పూసల స్టాల్

క్లుప్తంగా

పాలిథిన్ వాడకంపై ఉక్కుపాదం


తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాయగడ: పాలిథిన్ క్రయవిక్రయాలపై నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ పట్టణంలో కొందరు వ్యాపారులు యథేచ్ఛగా విక్రయిస్తుండటంపై మున్సిపాలిటీ యంత్రాంగం స్పందించింది. శనివారం వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు చేపట్టింది. మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి కులదీప్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దాడులో 10 కిలోల పాలిథిన్ బ్యాగులను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు.

కేంద్ర ఆస్పత్రిలో ఐసీయూ సౌకర్యం


జయపురం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి

జయపురం: జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో త్వరలో ఐసీయూను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిసింది. ప్రమాద స్థితిలో ఉన్న రోగులు ఐసీయూ కోసం ప్రైవేట్ ఆస్పత్రి లేదా కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల మెడికల్‌పై ఆధార పడుతున్నారు. జయపురంలో ఐసీయూ ప్రారంభిస్తే ఐసీయూ సౌకర్యం జయపురంలోనే కలుగుతుందని వెల్లడించారు.

గంజాయితో ముగ్గురు అరెస్టు

టెక్కలి రూరల్: ఒడిశా నుంచి అక్రమంగా 23.025 కేజీల గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గంజాయి రవాణాపై వచ్చిన ముందస్తు సమాచారం మేరకు టెక్కలి పోలీసులు రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చే మార్గంలో వాహన తనిఖీలు నిర్వహించారన్నారు. ఈ తనిఖీల్లో ఒడిశా రాష్ట్రం రాయఘడ జిల్లా పద్మపూర్ పరిధి తెంబగూడ, మిల్కాపంగా గ్రామాలకు చెందిన రచనా లియా, ఆకాష్ ఘంటా, తారా కుమారి బర్ధాన్ అనే ముగ్గురు వ్యక్తులు మూడు బ్యాగుల్లో 23.025 కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారని వెల్లడించారు. ఈ గంజాయిని రాయఘడ జిల్లా సుందరిగూడకు చెందిన బిడికి రమేష్ అనే వ్యక్తి, మహారాష్ట్రలోని అకోలా జిల్లా హరిహరపేటకు చెందిన గోకుల్‌చంద్రాకు అప్పజెప్పేందుకు ఈ ముగ్గురినీ వినియోగిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. మిగిలిన ఇద్దరు వ్యక్తులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మెళియాపుట్టి: కరెంట్ షాక్‌తో ప్రైవేట్ లైన్‌మెన్ మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం గొడ్డ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గొడ్డ గ్రామానికి చెందిన ప్రైవేట్ లైన్‌మెన్ కోరాడ షణ్ముఖరావు (67) గ్రామంలోని ఒక ఇంట్లో ఎర్త్ ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ సరఫరా రావడంతో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే గ్రామస్తులు మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కొంతకాలం క్రితం ఒక్కగానొక్క కుమారుడు రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలుస్తోంది.

జవాన్ బలవన్మరణం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి 3వ వార్డు శివాజీనగర్‌కు చెందిన బద్రి ఈశ్వరరావు (38) శనివారం బలవన్మరణం చెందాడు. జవాన్ (ఐటీబీపీ)గా పనిచేస్తున్న ఈయన సెలవుపై ఇంటికి వచ్చి ఉన్నారు. అయితే శనివారం మధ్యాహ్నం తన ఇంట్లో ఉరివేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత రెండు రోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ ఉన్నాడని, అందుకే బలవన్మరణానికి పాల్పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతుడుకి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-2 ఆర్‌ఆర్ కాలనీకి చెందిన పెద్దకోట గోవిందరావు(49) శనివారం రాత్రి మండలంలోని నేరడి గ్రామానికి వెళ్లే దారిలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ తెలియజేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు గోవిందరావు కుటుంబంతో పాటు 80 సంవత్సరాల వయస్సు ఉన్నటువంటి అతని అత్త పాపమ్మ నివాసం ఉంటోంది. అయితే అతడి అత్త పాపమ్మ తన ఆస్తి మొత్తం నష్టం చేశావని అల్లుడు గోవిందరావును అన్నది. దీంతో మనస్తాపం చెందన ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయి చెట్టుకు ఉరివేసుకున్నట్లు తెలుస్తోంది. అటువైపు వెళ్లిన ఒక వ్యక్తి చెట్టుకు వేలాడుతున్న గోవిందరావును చూసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. భార్య దశాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విజ్ఞాన మేళా అదరహో..


సరస్వతీ శిశుమందిర్ విజ్ఞాన మేళాలో ప్రారంభ గీతం పాడుతున్న విద్యార్థులు

పర్లాకిమిడిలోని సరస్వతీ శిశువిద్యామందిర్‌లో విజ్ఞానమేళా 2025-26ను జిల్లా ముఖ్యశిక్షాధికారి డాక్టర్ మాయాధర్ సాహు ప్రారంభించారు. శిశువిద్యామందిర్ స్కూల్ కమిటీ అధ్యక్షుడు సుభాష్ జమాదార్ అధ్యక్షత వహించగా, గౌరవ అతిథులుగా మహంత రామానంద దాస్, జిల్లా సైన్సు కోఆర్డినేటరు అంపోలు రవికుమార్, ఉపాధ్యక్షులు సంజయ్ జెన్నా, జాయింట్ సెక్రటరీ బిభూతీ భూషణ్ రథ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ సాహు మాట్లాడుతూ ప్రఖ్యాత శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సైన్సులో సాధించిన ఉన్నతిని విద్యార్థులకు వివరించారు. అనంతరం మేళాలో 150పైగా ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఖగోళ శాస్త్రం, పర్యావరణం, చెత్త రీసైక్లింగ్, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, ఇరిగేషన్, ఇంకుడు గుంతలు వంటి ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. న్యాయనిర్ణేతలుగా విశ్రాంత ఉపాధ్యాయులు బినోద్ జెన్నా, మనోజ్ కుమార్ పండా, ప్రమోద్‌కుమార్ రథ్, హరికృష్ణ మిశ్రా, హరినాథ పాత్రో, ఆనంద శతపతి, అమూల్యా పాణిగ్రాహి, సరోజ్ గౌడో, జి.శ్రీలక్ష్మి, కవితా రవుతో, గోపాలకృష్ణ పట్టజోషి తదితరులు వ్యవహరించారు. కార్యక్రమాన్ని విద్యాలయం ప్రధాన ఆచార్యులు సరోజ్ పండా పర్యవేక్షించారు.

– పర్లాకిమిడి


ఖగోళంలో వివిధ గ్రహాలు లైట్ల రూపంలో..


ఖగోళ శాస్త్రం ప్రాజెక్టును పరిశీలిస్తున్న డీఈఓ


పర్యావరణం ప్రాజెక్టు


విజ్ఞాన మేళా 25-26ను ప్రారంభిస్తున్న డీఈఓ మాయాధర్ సాహు


భవిష్యత్తులో ఇంటి నిర్మాణాలు


మాట్లాడుతున్న జిల్లా ముఖ్యశిక్షాధికారి సాహు


మేళాకు హాజరైన విద్యార్థులు

రూ.అరకోటి విలువైన గంజాయి స్వాధీనం

- ఒడిశా నుంచి తమిళనాడుకు తరలిస్తుండగా పట్టివేత
- 262 కిలోల గంజాయి, స్కార్పియో, స్కూటీ స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్టు


గంజాయి, స్కార్పియో, నిందితులతో డీఎస్పీ శ్రావణి, పోలీసులు

కశింకోట: ఒడిశా నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిపోతున్న దాదాపు అరకోటి రూపాయల విలువైన 262 కిలోల గంజాయిని అనకాపల్లి జిల్లా కశింకోటలో శనివారం పోలీసులు పట్టుకున్నారు. నలుగుర్ని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. రవాణాకు వినియోగించిన స్కార్పియో, స్కూటీ, 4 సెల్‌ఫోన్లు, రూ.3200 స్వాధీనం చేసుకున్నారు. అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశా నుంచి తమిళనాడుకు ప్యాకెట్ల రూపంలో బస్తాల్లో గంజాయి అక్రమ రవాణా అవుతుందన్న విశ్వసనీయ సమాచారం నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో స్థానిక సత్తెమ్మతల్లి మలుపు వద్ద ఎస్‌ఐలు కె. లక్ష్మణరావు, పి. మనోజ్ కుమార్, సిబ్బంది వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో స్కూటీ, స్కార్పియో వాహనాలు అనుమానాస్పదంగా రావడం గమనించారు. పోలీసులను చూసిన వెంటనే స్కూటీపై ఇద్దరు వ్యక్తులు, కారులోని ముగ్గురు వ్యక్తులు వాహనాలను నిలిపి పారిపోయేందుకు ప్రయత్నం చేశారు. వారిలో అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం నిట్టపుట్టు గ్రామానికి చెందిన అనుగూరి కొండబాబు, కె. కోటపాడు మండలం పైడంపేట గ్రామానికి చెందిన స్కార్పియో డ్రైవర్ చిరికి రాఘవ, బండారు గణేష్, పెదబయలు మండలం బొడ్డగొంది గ్రామానికి చెందిన అనుగూరి సోమేష్ కుమార్‌లను పోలీసు బృందం పట్టుకుంది. స్కార్పియోలో గంజాయి ఉన్నట్లు ఒప్పుకోవడంతో దాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. ఒకరు మాత్రం పరారయ్యాడు. అతన్ని అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం బొంగరం పంచాయతీ డోమలొడ్డు గ్రామస్తునిగా గుర్తించారు. ఇతడితోపాటు ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పనికిబండ గ్రామానికి చెందిన వంతల ధనుర్జయ్, తమిళనాడుకు చెందిన రమేష్ ఈ కేసుకు సంబంధించి పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. వీరిని పట్టుకోవడానికి చర్యలు కొనసాగుతున్నాయన్నారు. గంజాయి పట్టుకున్నందుకు సీఐ, ఎస్‌ఐలు, సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన సమాజం


జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి

జయపురం: పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన సమాజం సాధ్యమని జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి అన్నారు. జయపురం సమితిలో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించేందుకు బ్యాటరీ వాహనాలను శనివారం ప్రారంభించారు. స్థానిక సమితి కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మలేరియా, డెంగీ, చికిన్‌గునియా, అతిసారం మొదలగు వ్యాధులు పరిశుభ్రత లేమి కారణంగానే వ్యాపిస్తాయన్నారు. అందుకే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. సమితిలోగల 22 పంచాయతీలకు 22 వాహనాలను సమకూర్చినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మరో పది బ్యాటరీ వాహనాలను తెప్పించేందుకు నిధులు మజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. గ్రామ పంచాయతీల అధికారులు, సమితి సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పీఎం కిసాన్


పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సమావేశాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మధుమిత, పక్కన ఎమ్మెల్యే రూపేష్


పీఎం సమ్మాన్ నిధి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న ప్రభుత్వ అధికారులు, రైతులు


సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే, కలెక్టర్, జిల్లా పరిషత్ అధికారి

పర్లాకిమిడి: స్థానిక యూనియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పంపిణీ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మధుమిత ప్రారంభించారు. అర్హులందరికీ పీఎం కిసాన్ నిధులు జమయ్యాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, జిల్లా వ్యవసాయ అధికారి, ఉద్యానవన శాఖ డెప్యూటీ డైరెక్టర్ సుశాంత్ కుమార్ దాస్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శంకర్ కెరకటా, ఆదనపు సీఈఓ ఫృధ్వీరాజ్ మండల్, వాటర్ షెడ్ పీడీ సురేష్ పట్నాయక్, పులువురు అధికారులు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం 9 కోట్ల 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమచేశారు.

ఉపాధ్యాయుల ఆందోళన

జయపురం: ప్రభుత్వం తలపెట్టిన యూనిఫైడ్ ఆటోమిషన్ సిస్టమ్(యు.ఎ.ఎస్)కు వ్యతిరేకంగా జయపురం సబ్ డివిజన్‌లో ఉపాధ్యాయులు శనివారం ఆందోళన చేపట్టారు. ర్యాలీలు నిర్వహించి బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి కార్యాలయం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. పాఠశాలల పరిస్థితిని పరిగణనలోనికి తీసుకోకుండా యూనిఫైడ్ ఆటోమిషన్ సిస్టమ్ అమలు చేయడం తగదన్నారు. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కొరత ఎక్కువగా ఉందని, అనేక స్కూళ్లకు రహదారి సౌకర్యం కూడా లేదన్నారు.


బొరిగుమ్మలో వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ నేతలు


జయపురం బీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు


బొయిపరిగుడలో వినతిపత్రం అందజేస్తున్న టీచర్లు

మేరింగిలో జ్వరాల విజృంభణ


మేరింగి గ్రామం


మేరింగి గ్రామానికి వెళ్లే దారి


జ్వరంతో మంచం పట్టిన వృద్ధురాలు


జ్వరంతో బాధపడుతున్న యువకుడు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సమితి ఘనాత్రి పంచాయతీ మేరింగి గ్రామంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంటా జ్వర పీడితులు కనిపిస్తున్నారు. ఈ గ్రామంలో సుమారు 32 ఆదివాసీలు కుటుంబాలు ఉంటున్నాయి. వ్యవసాయం, కూలిపనులు చేసుకుని జీవనోపాధి పొందుతుంటారు. రెండు వారాలుగా గ్రామంలో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. మందులు వాడుతున్నా జ్వరాలు తగ్గడం లేదు. గుణుపూర్‌కు సుమారు 30 కిలోమీటర్ల దూరంలో కొండ ప్రాంతంలో ఈ గ్రామం ఉంది. సరైన రహదారి సౌకర్యాలు కూడా లేక గ్రామస్తులు వైద్య సౌకర్యాలకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లా సంక్షేమశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలి

- బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నీలమాధవ హికక

రాయగడ: రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్వాహకులు అశ్రద్ధ వహిస్తుండటంతో అనారోగ్యానికి గురై విద్యార్థులు మృతి చెందుతున్న ఘటనలు ఉన్నాయని బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక ఆరోపించారు. ఈ మేరకు బిసంకటక్‌లో గల ఇన్స్‌పెక్షన్ బంగ్లాలో శనివారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడారు. గత కొద్ది రోజులుగా జిల్లాలో గల ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు మృతి చెందుతున్న ఘటనలపై ధ్వజమెత్తారు. జిల్లా సంక్షేమశాఖ అధికారిపై జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోకపోతే సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆదివాసీ మహాసంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టడం ఖాయమని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమితి పరిధిలోని గొటిగుడ గ్రామంలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెసిడెన్సియల్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చందన్ కుంభారిక అనే విద్యార్థికి సకాలంలో వైద్యం అందక మృతి చెందాడన్నారు. ఈ ఘటనకు సంబంధించి సంబంధిత శాఖ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న చందన్ జూలై 26వ తేదీన మృతి చెందాడు. కడుపు నొప్పి, జ్వరంతో బాధపడుతున్న చందన్‌ను ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు పట్టించుకోలేదన్నారు. కనీసం వారి కుటుంబీకులకు కూడా ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించిన అనంతరం తల్లిదండ్రులకు తెలియజేశారని, హస్పిటల్‌కు తీసుకువెళ్తే అక్కడే గత నెల 26న మృతి చెందాడన్నారు. ఇటువంటి సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నా కనీసం అధికారులపై, నిర్వాహకులపై చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు.

స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలో గజపతి స్టేడియంలో 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆదనపు జిల్లా మాజిస్ట్రేట్ ఫల్గుణి మరిఖి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం జరిగిన సమావేశానికి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శంకర కెరకెటా, డీఈఓ డాక్టర్ మాయాధర్ సాహు, డీపీఆర్ఓ ప్రదిప్త గురమయి, తదితరులు హాజరయ్యారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వివిధ పాఠశాలల్లో డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ఆగస్టు 15వ తేదీ ఉదయం 9.15 గంటలకు రాష్ట్ర మంత్రితో జాతీయ జెండా ఎగురవేత, తర్వాత పోలీసు, వివిధ పదాతి దళాలు, ఎన్‌సీసీ క్యాడెట్ల ప్యారేడ్, ఉపన్యాసం ఉంటాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల పోటీల్లో బహుమతులు పొందిన ఆటగాళ్లకు సత్కార కార్యక్రమం, జిల్లా స్థాయిలో పది పరీక్షల్లో ఏ1 సాధించిన విద్యార్థులకు కూడా ముఖ్యఅతిథి చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి వివిధ ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఉన్నతాధికారులు విచ్చేశారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి


ధర్నాలో బీజేడీ శ్రేణులు


ధర్నాలో బీజేడీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడ రబీనారాయణ నందో తదితరులు


చీఫ్ ఇంజినీర్ కార్యాలయ అధికారికి వినతిని సమర్పిస్తున్న నబీనందో తదితరులు

- బీజేడీ నాయకుల ఆందోళన


ప్రసంగిస్తున్న కార్మిక నేత బాలారాయ్


మాట్లాడుతున్న మాజీ మంత్రి రబినారాయణ నందో

జయపురం: బొరిగుమ్మ-కొరాపుట్ 48వ రాష్ట్ర హైవేలో గల రాణిగుడ ప్రాంత రోడ్డు వెంటనే బాగు చేయాలని డిమాండ్ చేస్తూ కొరాపుట్ జిల్లా బిజూ జనతా దళ్ పార్టీ నాయుకలు శనివారం ఆందోళన చేపట్టారు. ఆ మార్గంలో బొరిగుమ్మ నుంచి కొరాపుట్ వరకు ఉన్న 48వ రాష్ట్ర రహదారిలో ఏడు కిలోమీటర్ల రోడ్డు దారుణంగా ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పార్టీ ఆరోపించింది. రోడ్డుకు మరమ్మతులు లేదా పునఃనిర్మాణం చేపటాటలని బీజేడీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి రబీనారాయణ నందో నేతృత్వంలో ఇంద్రావతి, కొలాబ్ డివిజన్ బేసిన్ చీఫ్ ఇంజినీర్ బేసిన్ మేనేజర్ బరిణిపుట్, జయపురం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సమస్యను పరిష్కరించాలని చీఫ్ ఇంజినీర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రబీనారాయణ నందో మాట్లాడుతూ.. బొరిగుమ్మ నుంచి కొరాపుట్‌కు 40 కిలోమీటర్ల రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ధర్నాలో జిల్లా బీజేడీ కార్మిక నేత బాలారాయ్, కొరాపుట్ మాజీ ఎమ్మెల్యే రఘునాథ్ పడాల్, బిరెన్ బిశాయి, టున రథ్, నాగు దొర, దుర్గ మిశ్ర, సీనియర్ మహిళా నేత ఎం.మంగమ్మ, బొరిగుమ్మ సమితి అధ్యక్షులు దీప్తి నాయిక్, మహేంద్ర అధికారి, హరి మిశ్ర, అధికసంఖ్యలో కార్యకర్తలు పాల్గున్నారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా - యువకుడికి తీవ్రగాయాలు


గాయాల పాలైన హరి

జామి: ఆటో బోల్తాపడి యువకుడు తీవ్ర గాయాల పాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు అందించిన సమచారం ప్రకారం.. శాశనపల్లి గ్రామానికి చెందిన ఐ.హరి భీమసింగి గ్రోమోర్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. శనివారం ఎరువులు నిమిత్తం భీమసింగి నుంచి కొత్తవలస ఆటోలో వెళ్తున్న సమయంలో అలమండ సంత సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న హరి తీవ్ర గాయాల పాలయ్యాడు. గాయాల పాలైన హరిని 108 వాహనంలో విజయ నగరం ఆసుపత్రికి తరలించారు. అటుగా వెళ్తున్న ఎంపీపీ సబ్బవరపు అరుణ, అతని భర్త దగ్గరుండి సహాయ సహకారాలు అందించారు.

'ఆపరేషన్ ట్రేస్'తో సత్ఫలితాలు

విజయనగరం క్రైమ్ : 'ఆపరేషను ట్రేస్' కార్యక్రమంలో భాగంగా అదృశ్యమైన మహిళలు, బాలబాలికల ఆచూకీని కనుగొనేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందల్ శనివారం పేర్కొన్నారు. జిల్లాలోని గజపతినగరం పోలీస్‌స్టేషన్ పరిధి పురిటిపెంటలో అదృశ్యమైన బాలికను గంట వ్యవధిలో కనుగొన్నామని స్పష్టం చేశారు. బాలికను ఆమె తల్లికి ఈ నెల ఒకటవ తేదీని అప్పగించామని తెలిపారు. బాలికలపై అఘాయిత్యాలను నియంత్రించేందుకు జిల్లాలో వివిధ పాఠశాలల్లో విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, తమను తాము రక్షించుకొనేందుకు అవసరమైన సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌ను కూడా నేర్పిస్తున్నామన్నారు.

లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర నష్టం


కార్యక్రమంలో మాట్లాడుతున్న గీత

నెల్లిమర్ల: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన లేబర్‌కోడ్‌లతో కార్మిక లోకానికి తీరని అన్యాయం జరుగుతుందని ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. నెల్లిమర్ల పట్టణంలోని అమరవీరుల స్మారక భవనంలో ఇఫ్టూ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. శిక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వివరించారు. కోడ్‌లు పూర్తిగా యాజమాన్యాలకు కొమ్ముకాసే విధంగా ఉన్నాయని ఆరోపించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలసూరి, ప్రధాన కార్యదర్శి గీత ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

'పట్టాలిచ్చిన భూముల్లోనే సాగు చేసుకోవాలి'

- ఏపీఐఐసీకి ఇచ్చిన భూములు వదిలి వెళ్లిపోవాల్సిందే..
- గిరిజన రైతులకు అధికారుల హుకుం


మాట్లాడుతున్న తహసీల్దార్ అజు రఫిజాన్

రామభద్రపురం: గిరిజన రైతులు వారికి పట్టాలిచ్చిన భూముల్లోనే సాగు చేసుకోవాలని, ఏపీఐఐసీకి ఇచ్చిన భూములు వదిలి వెళ్లిపోవాలని సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో శనివారం డీటీ గిరిధర్, ఫారెస్టు సెక్షన్ అధికారి మహింద్ర, ఎస్ఐ వి.ప్రసాదరావు సమావేశమయ్యారు. కొద్ది రోజులుగా కాకర్లవలస గిరిజన రైతులు భూ సమస్యలపై చేపడుతున్న ఆందోళనలపై చర్చించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఏపీఐఐసీకి విక్రయించిన భూములు సర్వే నంబర్ 717లో ఉన్నాయని, గిరిజన రైతులకు ఇచ్చిన ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు సాలూరు ఫారెస్ట్ బీట్ కంపార్ట్‌మెంట్ 179లో ఉన్నాయన్నారు. ఈ భూములు కొండ పక్కన పట్టాలు ఇస్తే ఏపీఐఐసీకి కేటాయించిన భూమిలో ఎలా సాగు చేస్తారని? ఇది డీ పట్టా భూమి అని మీరు సాగు చేస్తే కుదరదని, వదిలి వెళ్లిపోవాల్సిందేనని తేల్చి చెప్పారు. ఫారెస్టు సెక్షన్ అధికారి మహింద్ర మాట్లాడుతూ ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మా అటవీ శాఖాధికారులు ఇచ్చారన్నారు. ఒకసారి ఇచ్చిన పట్టా రద్దు చేయడం కుదరదని, ఇలా రైతులు అభ్యంతరం పెట్టే హక్కు లేదన్నారు. నిబంధనల ప్రకారం భూమి ఖాళీ చేసి ఎక్కడ ఇచ్చారో అక్కడకు వెళ్లి సాగు చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో సర్వేయర్ వి.సాయికుమార్, వీఆర్వో మహేష్‌కుమార్, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

బొడ్డవర చెక్‌పోస్టు వద్ద..
గంజాయి రవాణాకు చెక్!

- ఒడిశా నుంచి కేరళకు గంజాయి తరలింపు
- ఎల్.కోట పోలీసులకు చిక్కిన ఇద్దరు నిందితులు
- 145 కిలోల గంజాయి, బొలెరో వాహనం స్వాధీనం


పట్టుబడిన గంజాయిని, నిందితులను విలేకరుల సమావేశంలో ప్రవేశపెట్టిన ఎస్పీ

విజయనగరం క్రైమ్: ఎస్.కోట బొడ్డవర చెక్‌పోస్టు వద్ద గంజాయి అక్రమ రవాణాకు పోలీసులు చెక్ పెట్టారు. ఎల్.కోట పోలీసులకు అందిన కచ్చితమైన సమాచారంతో ఒడిశా నుంచి కేరళ రాష్ట్రానికి బొలెరో వాహనంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను బొడ్డవర చెక్‌పోస్టు వద్ద అదుపులోకి తీసుకున్నట్టు ఎస్పీ వకుల్ జిందల్ శనివారం వెల్లడించారు. డీపీవోలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. నిందితుల నుంచి 71 ప్యాకెట్లలో గల 145 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్పీ తెలిపారు. పట్టుబడిన నిందితుల్లో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పదువ మండలం కుదుబ్కికి చెందిన డంబు శిరగం అలియాస్ కృష్ణ(21), ఖసర్గాడ్ మంచజెవరం మండలం హూసంగలికి చెందిన మొహమ్మద్ షఫీక్(36)గా విచారణలో గుర్తించామన్నారు. కేరళ రాష్ట్రం ఖసర్గాడ్మంజెవరం మండలం హూసంగలికి చెందిన అబుబాకర్ సిద్ధికి ఆదేశాలతో కలిసి గంజాయిని డంబు శిరగం అలియాస్ కృష్ణ వద్ద కొనుగోలు చేసి బొలెరో వాహనంలో తరలిస్తుండగా ఎల్.కోట పోలీసులు గొల్జాం వద్ద వాహన తనిఖీలు చేపట్టి పట్టుకున్నారన్నారు. నిందితులపై చట్ట ప్రకారం దర్యాప్తు చేస్తామని, పీడీ చట్టం ప్రయోగిస్తామని తెలిపారు. గంజాయిని పట్టుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఎస్.కోట రూరల్ సీఐ ఎల్.అప్పలనాయుడు, ఎల్.కోట ఎస్ఐ నవీన్ పడాల్, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో ఆయనతో పాటు విజయనగరం డీఎస్పీ శ్రీనివాస్, సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ నవీన్ పడాల్, ఎస్‌బీ సీఐ ఏవీ లీలారావు పాల్గొన్నారు.

బళ్లారి రాఘవతోనే సమాజంలో విప్లవాత్మక మార్పులు


బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఏఎస్పీ సౌమ్యలత తదితరులు

విజయనగరం క్రైమ్ : తన రచనలతో సమాజంలో విప్లవాత్మకమైన మార్పులను దివంగత బళ్లారి రాఘవ తీసుకువచ్చారని ఏఎస్పీ పి.సౌమ్యలత అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రాఘవ జయంతి డీపీవోలు శనివారం నిర్వహించారు. ముందుగా రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎస్పీ మాట్లాడుతూ బళ్లారి రాఘవ తెలుగు కళా రంగానికి విశేషమైన సేవలందించారన్నారు. ఉపాధ్యాయుడిగా, న్యాయవాదిగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, రాజకీయ నాయకునిగా విభిన్నమైన రంగాల్లో తన ప్రతిభను చాటుకున్నారన్నారు. పౌరాణిక నాటకాల్లో పద్యాల వినియోగం తారాస్థాయిలో పెరిగిందని వీటిని తగ్గించి నటనకు ప్రాధాన్యత కల్పించే విధంగా పాత్రలను తీర్చిదిద్దాలన్నారు. నాటక రంగంలో స్త్రీలను ప్రోత్సహించి నాటక రంగానికి తద్వారా సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి రాఘవ అన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ బి.సుధాకర్, ఆర్ఎస్ఐ ఎన్.గోపాలనాయుడు, ఏవో పి.శ్రీనివాసరావు, కార్యాలయ పర్యవేక్షకులు టి.రామకృష్ణ, వెంకటలక్ష్మి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో వ్యభిచార గృహ నిర్వాహకులు

విజయనగరం క్రైమ్ : విజయనగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిదిలో వ్యభిచార గృహాలను నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని పూల్‌బాగ్ కాలనీ సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఇద్దరు మహిళలు వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో సీఐ శ్రీనివాస్ ఆదేశాలతో స్టేషన్ మహిళా కానిస్టేబుల్ సదరు ఇంటికి వెళ్లి నిర్వాహకులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. స్టేషన్‌కు తీసుకొచ్చి విచారిస్తున్నారు. ఇదే విషయమై టూటౌన్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాలతో నగరంలో వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఇందులో భాగంగానే వచ్చిన సమాచారంతో ఇద్దరు మహళలను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

గంజాయి పట్టివేత


పట్టుకున్న గంజాయిని చూపిస్తున్న పోలీసులు

సాలూరు: పట్టణంలో 17.3 కేజీల గంజాయి పట్టుకున్నట్టు పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. పట్టణంలోని పాత బీఎస్ఎన్ఎల్ ఆఫీసు రోడ్డు వద్ద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు వారిని విచారించినట్టు తెలిపారు. తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వీరి వద్ద ఉన్న బ్యాగులలో 17.3 కేజీల గంజాయిని గుర్తించామన్నారు. కేసు నమోదు చేశామని, నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలను అందించాలి : కలెక్టర్


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్ తదితరులు


విజయనగరం ఫోర్ట్: బిడ్డపుట్టిన గంటలోపు తల్లిపాలు అందించాలని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో తల్లిపాల వారోత్సవాలు పోస్టర్స్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 7వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. తల్లిపాలు అమృతంతో సమానమన్నారు. తల్లిపాలు ప్రాముఖ్యతను వివరించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవి మాధవి, డీఐవో అచ్చుతకుమారి, అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాణి, ఎన్‌సీడీ పీవో డాక్టర్ సుబ్రమణ్యం, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ సాయిరాం, ఐసీడీఎస్ పి.డి డాక్టర్ విమలరాణి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు రక్షణ

విజయనగరం ఫోర్ట్: తల్లిపాలు బిడ్డకు రక్షణ అని ఐసీడీఎస్ పి.డి టి.విమలారాణి తెలిపారు. పట్టణంలోని సాలిపేట, బొబ్బాదిపేట, గోకపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవాల సందర్భంగా శనివారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని అది పిల్లలు వ్యాధి బారిన పడకుండా కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో జి.ప్రసన్న, సూపర్‌వైజర్ మేరి వనిత, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.సత్యవేణి, కె.గాయిత్రి, ఆర్.వెంకటరత్న పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లో డీలాపడిన వ్యాపారం

- డ్వాక్రా మహిళలు తప్ప...ఇతరులు కొనుగోలు చేయని వైనం
- మహిళల ఆర్థిక బలోపేతానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ మహిళా మార్ట్
- కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైఎస్సార్ పేరును తొలగించిన నిర్వాహకులు
- గతంలో రోజుకు రూ.80 వేల నుంచి రూ.1 లక్ష వరకు జరిగిన వ్యాపారం
- నేడు రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పరిమితం
- వ్యాపారాభివృద్ధిపై దృష్టి సారించని యంత్రాంగం
- కష్టంగా మారిన మహిళా మార్ట్ నిర్వహణ


కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న మహిళా మార్ట్

వీరఘట్టం: మహిళల ఆర్థిక స్వావలంబనకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టి ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టింది. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు మార్ట్‌లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టంలో గతేడాది జనవరి 12న వైఎస్సార్ మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ మార్ట్ ఏర్పాటుకు వీరఘట్టం మండలంలోని 15 వేల మంది డ్వాక్రా సంఘాల మహిళలు ఒక్కొక్కరూ రూ.200 పెట్టుబడితో రూ.30 లక్షలు పోగు చేసి వ్యాపారం ప్రారంభించారు. దీనికి గత ప్రభుత్వం కూడా కార్పొరేట్ కంపెనీలతో ఈ మార్ట్‌ను అనుసంధానం చేసి వీరికి కావాల్సిన నిత్యావసర సరుకులు, కాస్మోటిక్స్, వంటనూనెలు ఇలా అనేక వస్తువులను హోల్‌సేల్ మార్కెట్‌లో కొనుగోలు చేసి ఈ మార్ట్ ద్వారా విక్రయించడం ప్రారంభించారు. ప్రారంభించిన నాటి నుంచి మే నెల వరకు ఈ ఐదు నెలల్లో సుమారు రూ.1.50 కోట్లు వ్యాపారం చేపట్టారు. గత ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత నేటి వరకు వ్యాపారాలు డీలా పడడంతో బేరాలు సన్నగిల్లి మార్ట్ నిర్వహణ భారంగా మారింది.

జోరు తగ్గిన మార్ట్ వ్యాపారం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైఎస్సార్ మహిళా మార్ట్ బోర్డులో వైఎస్సార్ పేరును తొలగించారు. అంతేకాకుండా బ్యాంకు మాదిరి ఏసీ రూంలో ఉంటడడంతో మార్ట్ వైపు సామాన్యులు కూడా చూడడం లేదు. డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలు తప్ప ఇతరులు ఎవరూ ఇక్కడ సరుకులు కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారం పూర్తిగా పడిపోయింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక్కో కిరాణాషాపు రోజుకు రూ.1 లక్ష పైబడి అమ్మకాలు చేస్తున్నారు. మహిళా మార్ట్‌లో మాత్రం గత ఏడాదిగా రోజుకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు మాత్రమే వ్యాపారం జరుగుతున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు.

వెలవెల బోతున్న మహిళా మార్ట్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీరఘట్టం మహిళా మార్ట్ కొనుగోలుదారులతో కళకళలాడేది. నేడు కొనుగోలుదారులు లేక మార్ట్ వెలవెలబోతోంది. సుమారు రూ.13 లక్షల వ్యయంతో మార్ట్ నిర్మాణం చేపట్టారు. ఇందులో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.6 వేలు జీతం, ఇద్దరు సేల్స్ మెన్, ఉమెన్‌లకు రూ.12 వేలు జీతం, స్వీపర్‌కు రూ.3 వేలు, ఇంటి అద్దె రూ.25 వేలు, ప్రతీ నెలా కరెంట్ బిల్లు సరాసరిన రూ.6 వేలుతో కలిపి ప్రతీ నెలా నిర్వహణ ఖర్చు రూ.52 వేలు అవుతోంది. లాభం మాత్రం అంతంత మాత్రమే ఉండడంతో మార్ట్‌లో వ్యాపారం డీలా పడింది.

కొరవడిన పర్యవేక్షణ

వీరఘట్టం మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ మార్ట్‌కు విశాలమైన స్థలం ఉంది. ఈ స్థలంలో సరుకులను కొనుగోలుదారులకు కనిపించేటట్టు ఏర్పాట్లు చేయాలి. అయితే అధికారులు వ్యాపారంపై దృష్టి సారించకపోవడంతో కొనుగోలుదారులు ఇటువైపు రావడం మానేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మహిళా మార్ట్ వ్యాపారాభివృద్ధికి చర్యలు చేపట్టాలని పలువురు మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

వ్యాపారాభివృద్ధికి చర్యలు చేపడతాం



మహిళా మార్ట్ అభివృద్ధికి చర్యలు చేపడతాం. మహిళా సంఘాలతో పాటు స్థానికులు కూడా ఇక్కడ సరుకులు కొనుగోలు చేసేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించి మార్ట్‌లో వ్యాపారాభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. ప్రచారం పెంచి ప్రజలకు మార్కెట్ కంటే తక్కువ ధరకే నిత్యావసర సరుకులను అందజేసి మార్ట్‌కు పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతాం. ఈ మార్ట్‌ను ప్రజలందరికీ దగ్గరగా ఉండేలా ఏర్పాటు చేస్తాం.

– కె.లలితకుమారి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

ఏమైందో ఏమో..?

- రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య
- విలపిస్తున్న తల్లిదండ్రులు


హేమచంద్ మృతదేహం

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం వేకువజామున 3 గంటల సమయంలో రైలు కిందపడి పాలిటెక్నిక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మందరాడ గ్రామానికి చెందిన దేవళ్ల హేమచంద్(16) ఆమదాలవలస మండలం దన్నానపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ సంవత్సరం మెకానికల్ గ్రూపులో ఈ ఏడాది జాయిన్ అయ్యాడు. రెండో విడత కౌన్సిలింగ్ అనంతరం కాలేజీ మారుదామని ప్రయత్నం చేశాడు. అయితే మరెక్కడా సీటు రాకపోవడంతో ఆమదాలవలస పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో కొద్దిరోజులుగా ఉంటూ విద్యనభ్యసిస్తున్నాడు.

వసతి గృహంలో ఉండలేనని...



ఇక్కడ చదవడం ఇష్టం లేదని, వసతి గృహంలో ఉండలేనని మూడు రోజుల క్రితం విద్యార్థి తమ తల్లిదండ్రులకు చెప్పడంతో ఇంటికి తీసుకెళ్లి తండ్రి మణిభూషణరావు, తల్లి కుమారిలు తమ కుమారుడిని నచ్చజెప్పి మరలా వసతి గృహానికి పంపించారు. అయితే మృతుడు మళ్లీ శుక్రవారం తన తల్లిదండ్రులకు ఫోన్‌చేసి వసతి గృహం తనకు నచ్చలేదని, ఇంటికి వచ్చేస్తానని చెప్పినట్లు సమాచారం. ఇంతలోనే ఏమైందో తెలియదు కానీ మృతుడు వసతి గృహంలో శుక్రవారం రాత్రి భోజనం చేసి బయటకు వెళ్లిపోయాడు. తెల్లవారుజామున భువనేశ్వర్ వైపు వెళ్తున్న హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న హేమచంద్‌ను ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు కలిసి 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు జీఆర్‌పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందినట్లు వెల్లడించారు. అయితే హాస్టల్‌లో ఉండాల్సిన విద్యార్థి బయటకు వెళ్లి ఆత్మహత్య చేసుకోవడంపై కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం వలనే ఘోరం జరిగిందని వాపోతున్నారు.

కన్నీరుమున్నీరు

తమ కుమారుడు రైలు కిందపడి మృతి చెందిన విషయాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు ఇలా చేయడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన నాగభూషణరావు మందరాడ గ్రామంలోని శివాలయంలో అర్చకత్వం చేస్తూ జీవిస్తున్నారు. రెండో కుమారుడిని శ్రీశైలంలోని వేద పాఠశాలలో చదివిస్తున్నారు. పెద్ద కుమారుడు టెక్నికల్ విద్యనభ్యసిస్తే కుటుంబాన్ని ఆదుకుంటాడని అనుకున్నామని వారు విలపిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టిస్తోంది. మరోవైపు తోటి విద్యార్థి మరణ వార్తతో హాస్టల్ విద్యార్థులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

10న జిల్లా స్థాయి యోగా పోటీలు


జిల్లా స్థాయి యోగా పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

విజయనగరం: జిల్లా స్థాయి యోగాసన పోటీలు ఆగస్టు 10న విజయనగరం జిల్లా కేంద్రంలోని మెసానిక్ టెంపుల్‌లో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్టు విజయనగరం జిల్లా యోగాసన స్పోర్ట్స్ అధ్యక్షులు డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు తెలిపారు. ఈ మేరకు శనివారం పోటీల నిర్వహణకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ పోటీల్లో 10 నుంచి 55 సంవత్సరాలలోపు వయస్సు గల స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మొత్తం 10 కేటగిరీల్లో నిర్వహించే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జనరల్ సెక్రటరీ నరసింహమూర్తి 7702134568 నంబరుకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వద్దమాని నరసింహమూర్తి, పి.సత్యనారాయణ, డి.శివ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు


క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు


విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న బాక్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. శనివారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల విశాఖలో జరిగిన 6వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాల, బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో క్రీడాకారుడు బి.సచిన్, ఎం.జాహ్నవిలు బంగారు పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన ఇరువురు క్రీడాకారులు ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరగనున్న పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డోలా మన్మధకుమార్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఇందుకూరి అశోక్‌రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజు, రాకేష్‌కుమార్, మెహబూబ్ షరీఫ్, శాప్ కోచ్ బి.ఈశ్వర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు పంపిణీ చేయకుంటే ఎలా?


మాట్లాడుతున్న ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి

తెర్లాం: ఖరీఫ్ సాగుకు సన్నద్ధమైన రైతులకు సకాలంలో ఎరువులు పంపిణీ చేయకపోతే ఎలా అని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై ఎంపీడీవో రేగి రాంబాబు సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో రైతు సేవా కేంద్రాల ద్వారా ఇంతవరకు 331 టన్నుల ఎరువులను రైతులకు పంపిణీ చేశామని ఏఈవో వెంకటేష్ తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఇతర సభ్యులు ఒక ఎకరాకు ఎన్ని బస్తాల ఎరువులు వేయాలని అడిగారు. రైతులకు సరిపోయే ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో సరఫరా చేయడం లేదని, ఎన్ని ఎకరాల భూములు ఉన్నా ఆధార్‌కార్డుకు ఒక బస్తా యూరియా మాత్రమే ఇస్తే ఎలా సరిపోతుందని వారు నిలదీశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు అవసరమైన ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా పూర్తిస్థాయిలో అందించారని, ఈ ప్రభుత్వంలో ఎరువుల కోసం రైతులు నానాపాట్లు పడాల్సి వస్తోందదని పణుకువలస, రంగప్పవలస, కూనాయవలస, విజయరాంపురం తదితర గ్రామాల సర్పంచ్‌లు తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీ చేస్తారా, చేయరా తెలియజేయాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని ఏఈఓ వెంకటేశ్ తెలిపారు. విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించగా లింగాపురం సర్పంచ్ బూరాడ తవిటినాయుడు మాట్లాడుతూ తమ గ్రామాలకు జేఎల్ఎం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రైతులకు సకాలంలో విద్యుత్ సరఫరా కావడం లేదన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని విద్యుత్ శాఖ మండల ఏఈ తెంటు శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో వివిధ శాఖలపై నిర్వహించిన సమీక్షలో సభ్యులు తెలియజేసిన అన్ని సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీపీ ఉమాలక్ష్మి, ఎంపీడీవో రాంబాబు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ గర్భాపు లూర్థు, వైస్ ఎంపీపీ రమాదేవి, ఉప తహసీల్దార్ గొంగాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు ఓరియంటేషన్ తరగతులు


మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి వై.నాగేశ్వరరావు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులను అన్ని విధాల సంసిద్ధం చేయడానికి ఓరియంటేషన్ తరగతులను నిర్వహించనున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వై.నాగేశ్వరరావు తెలిపారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఓరియంటేషన్ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరగతులు ప్రతీవారం చివరి పని దినం రోజు జరుగుతాయన్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులలో వారానికి ఒక సబ్జెక్టు చొప్పున ఈ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల మ్యాథ్స్ అధ్యాపకులకు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారన్నారు. తరగతి గది బోధనా ప్రక్రియలను మెరుగుపరచడానికి సైన్స్ ఫ్యాకల్టీ సామర్థ్యాలను నిరంతరం అభివద్ధి చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మారిన సిలబస్ విద్యార్థులకు చక్కగా బోధించే నైపుణ్యాలను అధ్యాపకులంతా అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో 14 జూనియర్ కళాశాలల గణిత అధ్యాపకులు, పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు పాల్గొన్నారు.